ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



అన్నమయ్య

జిల్లా వార్తలు

5 ఆదివారం 25 ఫిబ్రవరి 2024



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2024 సాధారణ ఎన్నికల ఓటర్ల జాబితా, సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీలతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలపై, ఓటర్ల జాబితాలో, ఎన్నికలకు సంబంధించిన ఇతర ఏ అంశాలపైన, ఏవైనా ఫిర్యాదులు చేస్తే వాటిని త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో ఎన్నికలకు సంబంధించిన నోడల్ అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని, మండల స్థాయిలో కూడా శిక్షణా తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించిన ఆర్వోలకు, తహసీల్దార్లకు గత రెండు వారాలు శిక్షణ పూర్తయ్యిందని తెలిపారు. కౌంటింగ్ హాల్స్‌పై వచ్చే వారంలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్వోలు, ఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలకు టీడీపీ సిద్ధం

సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో వైసీపీతో తలపడేందుకు రేసుగుర్రాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు శనివారం ఉండవల్లిలో సంయుక్తంగా తొలిజాబితా అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగతా నియోజకవర్గాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థులను ప్రకటించిన మూడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

● తొలి జాబితాలో జిల్లాలో ముగ్గురికి చోటు ● రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లెలో అభ్యర్థుల ప్రకటన ● టికెట్టు రానిచోట్ల అసంతృప్త జ్వాలలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన పార్టీల కూటమి శనివారం ప్రకటించిన అభ్యర్థుల తొలిజాబితాలో జిల్లాలో ముగ్గురికి చోటు దక్కింది. తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి, పీలేరు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాయచోటి నియోకవర్గంలో మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలకు టికెట్లు ఖరారు చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో వారి అనుచరులు స్వీట్లు తినిపించుకొని, బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. టికెట్టు రాని చోట్ల ఆయా నాయకుల ముఖ్య అనుచరులు తమ పదవులకు రాజీనామా చేసి నిరసన తెలిపారు. పీలేరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున కిశోర్ బరిలో ఉంటారని అందరికీ తెలిసినప్పటికీ తొలి విడతలోనే చంద్రబాబునాయుడు ఆయన పేరు ప్రకటించగానే కిశోర్ స్వగ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున నగరిపల్లెకు చేరుకుని బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశాయి.

ఈయన 2018-19 వరకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన మొదటిసారిగా 2014లో తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్థాపించిన 'జై సమైఖ్యాంధ్ర పార్టీ' తరపున పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి అయిన చింతల రామచంద్రారెడ్డి చేతిలో 15 వేల ఓట్ల తేడాతో పరాజయం చెందారు. 2019 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ వైసీపీ ప్రభుత్వ అసమర్థ విధానాలపై పోరాడారు. పీలేరు నియోజకవర్గంలో అధికార వైసీపీ నాయకుల భూఆక్రమణలపై క్షేత్రస్థాయిలోనే కాకుండా లోకాయుక్త, రాష్ట్ర హైకోర్టులో కూడా న్యాయపోరాటం చేశారు.



ఇక రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి.. 2003లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఈయన తండ్రి మండిపల్లె నాగిరెడ్డి 1985, 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1991లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. అనంతరం ఆయన సోదరుడు నారాయణరెడ్డి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ.. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. తదనంతరం 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో తన సోదరి శ్రీలతరెడ్డికి రాంప్రసాద్‌రెడ్డి టికెట్టు ఇప్పించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆమె స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఈయన తల్లి సుశీలమ్మ చిన్నమండెం మండలం మండలాధ్యక్షురాలిగా పనిచేశారు.

ఇక తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి.. రైతు కుటుంబంలో జన్మించి బిటెక్ చదివి నాబార్డులో పనిచేశారు. తర్వాత 2010లో వ్యాపార రంగంలో అడుగుపెట్టి విజయం సాధించారు. ఈయన తండ్రి నారాయణరెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. అప్పట్లో టీడీపీ తరపున పోటీ చేసిన ఉమాశంకర్‌రెడ్డితో కలిసి పనిచేశారు. ఈయన కనుగొండ రాయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. జయచంద్రారెడ్డి 2020 నుంచి తంబళ్లపల్లె నియోకవర్గంలో పరోక్ష రాజకీయాల్లో పాల్గొన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను..



నాపై నమ్మకంతో తొలి విడతలోనే నా పేరు ప్రకటించినందుకు చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ ఎన్నికల్లో పీలేరులో టీడీపీ జెండా ఎగురవేస్తాను. పార్టీ శ్రేణులు చాలా కసిగా ఉన్నారు. వారందరి సహకారంతో ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తాను.

- నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, పీలేరు టీడీపీ అభ్యర్థి

టీడీపీ, జనసేన జెండాలు ఎగురవేస్తాం..



తంబళ్లపల్లె నియోజకవర్గ గడ్డపై టీడీపీ, జనసేన పార్టీల జెండాలు ఎగురవేస్తాం. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు అవకాశం కల్పించిన అధినేత చంద్రబాబుకు పాదాభివందనం. టీడీపీ, జనసేన శ్రేణులందరినీ కలుపుకొని జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిచి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తాం.

- జయచంద్రారెడ్డి, తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి

అందరినీ కలుపుకుని వెళ్లి విజయం సాధిస్తా

- మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి టీడీపీ అభ్యర్థి



నా మీద ఎంతో నమ్మకంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధానకార్యదర్శి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నాకు టికెట్టును కేటాయించారు. వాళ్లు నాపైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. పార్టీ బలంగా ఉంది కాబట్టే.. టికెట్టు కోసం పోటీ ఎక్కువగా ఉంది. టికెట్టు ప్రకటన తర్వాత.. చిన్నచిన్న అసంతృప్తులు సహజమే. త్వరలోనే టీకప్పులో తుఫాన్ లాగా సమసిపోతుంది. అందరినీ కలుపుకుని వెళ్తా.. తప్పకుండా విజయం సాధిస్తా.



సుగవాసి బాల సుబ్రమణ్యంను మర్యాద పూర్వకంగా కలిసిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వైభవంగా కోదండరాముని కళ్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 24: ఏకశిలా నగిరి కోదండరామాలయంలో పౌర్ణమి పురస్కరించుకొని శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేశారు. అనంతరం కళ్యాణతంతును ప్రారంభించి ముందుగా విచక్షణ పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతరణ, అనంతరం వైష్ణవ సంప్రదాయంలో టీటీడీ అర్చకులు మాంగళ్యధారణ గావించారు. అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండ్ల మార్పిడి కార్యక్రమాన్ని శాస్త్రీయంగా నిర్వహించి కల్యాణతంతును ముగించారు. ఈ వేడుకకు పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు మనోజ్‌కుమార్, వీణారాఘవాచార్యులు పాల్గొన్నారు.



ఆశీనులైన సీతారాములు

రేపు రూ.8.39 కోట్లతో భవనాలు ప్రారంభం

● వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 24: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మదనపల్లె మండలం సీటీఎం రైల్వేస్టేషన్ (మదనపల్లె రోడ్డు)లో నిర్మించిన భవనాలను, సదుపాయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు సీటీఎం రైల్వేస్టేషన్ మాస్టర్ కరుణాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీటీఎం రైల్వేస్టేషన్‌లో రూ.8.39 కోట్లతో అభివృద్ధి పనులు, ప్రయాణికులకు సదుపాయాలు, భవనాలు నిర్మించారన్నారు. అలాగే పీలేరులో కూడా రూ.6 కోట్లతో ఈ పథకం కింద పనులు పూర్తి చేశారని, ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్న ఈ కార్యక్రమాలకు ప్రజలు, ప్రయాణికులు పాల్గొనాలని స్టేషన్‌మాస్టర్ కరుణాకర్ కోరారు.

అడుగంటుతున్న బాహుదా

● తాగు, సాగునీటికి కటకట

● వేసవి రాకముందే మొదలైన కష్టాలు



బాహుదా ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని ముష్టూరు పంచాయతీలో వున్న బాహుదా ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో వేసవి రాకముందే ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. 1974లో దాదాపు రూ.64 లక్షల వ్యయంతో 398 ఎమ్‌సీఎఫ్‌టీ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 2880 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పూర్తి చేశారు. బాహుదాకు వర్షం నీటితో పాటు మదనపల్లి ప్రాంతంలో వున్న యాతాలవంక ద్వారా, బాహుదా కాలువ నుంచి వచ్చే నీరు ప్రాజెక్టులో కలుస్తోంది. దాదాపు మూడేళ్లుగా వర్షాలు అప్పుడప్పుడు కురుస్తుండడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. కాగా గతేడాది మాత్రం వర్షాలు రాకపోవడం వలన బాహుదాలో నిల్వ వున్న నీటిని ఇరిగేషన్ అధికారులు పంటలకు విడుదల చేశారు. దీని కారణంగా బాహుదాలో నీటిమట్టం తగ్గిపోయినట్లు రైతులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందేవారని, అధికారుల లెక్కల ప్రకారం 2880 ఎకరాలు సాగు అవుతుండగా వాస్తవానికి దాదాపు 3 వేల ఎకరాలకు పైగానే సాగు ఉంటుందని తెలిపారు. దీంతో పాటు బాహుదా నిండితే వాల్మీకిపురం, పీలేరు తదితర ప్రాంతాల్లో జీవించే రైతుల భూములకు కూడా నీరు చేరుతుంది. కాగా ఈ ప్రాజెక్టుకు ఎడమ, కుడి ద్వారా నీటిని విడుదల చేస్తారు. ఈ కాలువల కింద వున్న రైతులు వరి పంటలు పండిస్తుంటారు. ప్రస్తుతం బాహుదాలో నీరు తగ్గిపోవడంతో రైతులు సాగు చేసేందుకు జంకుతున్నారు. దీంతో పాటు తాగునీటికి మండల ప్రజలు కష్టాలు పడే పరిస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారి శ్రీహరిరెడ్డిని వివరణ కోరగా రైతుల కోరిక మేరకే నీటిని విడుదల చేశామని, దీని ద్వారా నీటిమట్టం తగ్గినట్లు తెలిపారు.

మళ్లీ కరువు వస్తుందేమో..



గతంలో కూడా తాగునీరు లేక ప్రభుత్వం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసింది. గత ఏడాది కూడా వర్షాలు సరిగా పడలేదు. ప్రాజెక్టులో నీరు ఉండి బోరుబావులు, చెరువులు నీటితో పుష్కలంగా ఉంటే తాగునీటి సమస్య వచ్చేది కాదు. ఈసారి కూడా వానలు రాకపోతే మళ్లీ కరువు వచ్చి బోరుబావులు ఎండిపోయే అవకాశం ఉంది.

- లక్ష్మన్న, రైతు, యర్రప్పగారిపల్లి, నిమ్మనపల్లి

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

● కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు



జిల్లా పోలీసు కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ విజయరావు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 24: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అందరూ టీం వర్క్‌గా పనిచేయాలని, భద్రత పరంగా గట్టి చర్యలు చేపట్టాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో డీఐజీ ముందుగా పోలీసు గార్డు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ బి.క్రిష్ణారావుతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయం పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే డీపీవో, ఆర్మ్‌డు రిజర్వుడు, డీసీఆర్‌బీ రికార్డుల నిర్వహణ గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీసీఆర్‌బీ విభాగంలో మహిళలపై జరిగే నేరాలు, ఎస్సీ ఎస్టీ నేరాలు, ఇతర ముఖ్యమైన రికార్డుల డేటాను పరిశీలించారు. ఏఆర్ విభాగంలో డిపాజిట్ చేసిన ఆయుధాల డేటా, మోటార్ ట్రాన్స్‌పోర్టు, స్పెషల్ పార్టీ అండ్ పీఎస్‌వోలు, మాబులేషన్, బీడీ టీం, పరేడ్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని సబ్‌డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. మద్యం, డబ్బు, బార్డర్ చెక్‌పోస్టుల వద్ద అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాల రికవరీ, రోడ్డు ప్రమాదాలు రాత్రి గస్తీ, సెక్టార్ మొబైల్స్, నాన్ బెయిలబుల్ వారెంట్స్, మర్డర్ కేసుల ముద్దాయి అరెస్టు పెండింగ్‌లపై ఆరాతీశారు. ఆయుధాల లైసెన్సుల డిపాజిట్లు, రౌడీషీటర్స్, ట్రబుల్ మాంగర్స్, సమస్యాత్మక గ్రామాల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమీపిస్తున్నందున జిల్లాలోని పోలింగ్ లోకేషన్స్, సీసీ కెమెరాలు గురించి వాకబు చేశారు. ఎన్నికల్లో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో భారీ నేరాలతో పాటు రోడ్డు ప్రమాదాల సంఖ్య బాగా తగ్గించామన్నారు. ఎన్నికలు కూడా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో ఏ చిన్న ఘటన జరిగినా టెలికాన్ఫరెన్స్‌లో వెంటనే అప్రమత్తం చేస్తున్నామని డీఐజీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ గదుల 'నిర్బంధ' వేలం !

● అధికారులను బెదిరించి మరీ వేలం నిర్వహించుకున్న అధికార పార్టీ నేతలు ● సిండికేట్ వ్యవహారాలను నిస్సహాయంగా చూస్తుండిపోయిన అధికారులు

పీలేరు, ఫిబ్రవరి 24: 'రూలూ లేదూ గీలూ లేదు సార్. మేమంతా ఇప్పటికే ఒక కట్టుబాటుకు వచ్చాం. ఇప్పుడు మీరు వచ్చి కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. మాకిష్టమైన విధంగా వేలం పాటలు నడపండి. కుదరదు గిదరదు అంటే ఇక్కడి నుంచి కదలనిచ్చేది లేదు' అంటూ అల్టిమేటం ఇచ్చారు. అలా కుదరదు, నిబంధనలు పాటించలేకుంటే వేలం పాటను వాయిదా వేస్తామని ప్రకటించిన అధికారులను బూతులు తిట్టడం, వారిపైకి దూసుకెళ్లడం, కొట్టినంత పని చేయడం, మినిట్స్ పుస్తకం లాగేసుకోవడం, చివరకు తమకు కావాల్సిన విధంగా వేలం పాటలను నిర్వహించుకున్నారు. వెరసి పీలేరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గదుల అద్దె కోసం శనివారం అధికారులు ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ప్రక్రియ కాస్తా 'నిర్బంధ' ప్రక్రియగా ముగిసింది. దీంతో గదుల బహిరంగ వేలం ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం పెంచుదామని అనుకున్న అధికారులు తమ పరువు కాపాడుకోవడానికి ఆపసోపాలు పడాల్సి వచ్చింది. అధికారిక కార్యక్రమాల్లో వైసీపీ నాయకుల మితిమీరిన జోక్యం, అంగీకరించని అధికారులపై దౌర్జన్యం చేయడానికి కూడా వెనుకాడకపోవడం, బూతులు తిట్టడం వంటి అంశాలు శనివారం మరోమారు వెలుగు చూశాయి.

వాయిదా కుదరదన్న అధికారులు

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని 18 గదులు, ఒక క్యాంటీన్, మూడు గోడౌన్లు, రెండు స్టెయిర్ కేసు గదుల అద్దెలను బహిరంగ వేలం ద్వారా నిర్వహించాలని పాలకమండలి నిర్ణయించి ఆ మేరకు ఈ నెల 17న పత్రికా ప్రకటన జారీ చేసింది. ఆ క్రమంలో 118 మంది దరఖాస్తులు తీసుకుని నిబంధనల మేరకు దరావత్తులను డీడీల రూపంలో చెల్లించారు. వారిలో అధిక శాతం అధికార పార్టీ నేతలే ఉండడం, గదుల కోసం అధికార పార్టీలోనే కుమ్ములాటలు వెలుగు చూడడంతో పాటు అధికార పార్టీ నాయకుల అధినాయకత్వంపై తీవ్ర ఒత్తిళ్లు రావడంతో వేలం పాటలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యల్లయ్య ప్రకటించారు. అయితే అప్పటికే గదుల వేలంలో అంతో ఇంతో సొమ్ము చేసుకుందామని సిండికేటు ఏర్పాటు చేసుకున్న అధికార పార్టీ నాయకులకు చుక్కెదురైంది. వేలం పాటలను ఎలాగైనా నిర్వహించి తీరాలని అటు మార్కెట్ కమిటీ పాలకవర్గం, ఇటు అధినాయకత్వంపై కొంత మంది ఒత్తిడి చేశారు. వేలం పాటలను తమ అనుమతి లేకుండా వాయిదా వేశారని, వాయిదా వేయాలన్నా, రద్దు చేయాలన్నా తమ అనుమతి తీసుకోవాలని, ఈ వాయిదా నిర్ణయం చెల్లదని, వేలం పాటలను నిర్వహించి తీరుతామని మార్కెటింగ్ శాఖ అధికారులు శనివారం ఉదయం తేల్చి చెప్పారు. ఈ మేరకు వేలం పాటలను తాము స్వయంగా నిర్వహిస్తామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కడప ప్రాంత సంయుక్త సంచాలకుడు రామాంజనేయులు, అన్నమయ్య జిల్లా సహాయ సంచాలకుడు త్యాగరాజు శనివారం ఉదయం పీలేరుకు చేరుకుని వేలంపాట నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. దీంతో సిండికేటు ఏర్పాటు చేసిన అధికార పార్టీ నేతల్లో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి. వెనువెంటనే వారు తాము ఏర్పాటు చేసుకున్న సిండికేటు మేరకు వేలం పాటల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.



మార్కెటింగ్ శాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నాయకులు



గదుల వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

అధికారులపైకి దూసుకెళ్లిన వైసీపీ నేతలు

వేలంపాటల ప్రక్రియ ప్రారంభించిన కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు రామాంజనేయులు మాట్లాడుతూ రూ.లక్ష దరావత్తు చెల్లించిన వారు ఏ గది వేలంలోనైనా పాల్గొనవచ్చని చెప్పడంతో వైసీపీ నాయకులు ఆగ్రహించారు. స్థానిక అధికారులు ప్రతి గదికీ విడిగా దరఖాస్తులు తీసుకున్నారని, ఏ గది కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆ గది వేలంలోనే పాల్గొనాలని, ఆ విధంగానే తాము కట్టుబాటు చేసుకున్నామని తెలిపారు. అలా కుదరదని ఆయన చెప్పడంతో వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా తాము కోరినట్లు వేలం నిర్వహించకుంటే వాయిదా వేసుకుని వెళ్లిపోవాలని ఆయనపై ఒత్తిడి తెచ్చారు. సిండికేటుగా ఏర్పడినప్పుడు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు సొమ్ములు ముట్టచెప్పేందుకు ఒప్పుకున్న వ్యాపారులు సైతం అధికారులపై తిరగబడ్డారు. నిబంధనల మేరకు వ్యవహరించగలం తప్ప ఇష్టారీతిన నడుచుకోలేమని చెప్పిన అధికారులను వైసీపీ నేతలు బూతులు తిట్టడం, పుస్తకా లు లాక్కోవడం, చేయి చేసుకున్నంత పని చేయడంతో వారు చేసేది లేక నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఇక అక్కడి నుంచి వేలం ప్రక్రియ అంతా వైసీపీ నాయకుల కనుసన్నల్లో నడిచింది. వారు నిర్ణయించిన మేరకు మాత్రమే వేలం పాటల్లో వ్యాపారులు పాల్గొని మార్కెట్ కమిటీ అధికారులు నిర్ణయించిన అప్‌సెట్ ధర కంటే కాసింత ఎక్కువ పెంచి గదులను సొంతం చేసుకున్నారు. కాగా సిండికేటు ఏర్పాటు చేసినందుకు మార్కెట్ కమిటీ గదుల్లో ఇప్పటికే వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు ఒక్కో గదిపై రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా అధికార పార్టీ నేతలకు ముట్టజెప్పినట్లు సమాచారం.



వివరాలు వెల్లడించకుండానే వెనుదిరిగిన అధికారులు

తాము నిర్వహించిన వేలం పాటల ద్వారా మార్కెట్ కమిటీకి పెరిగిన ఆదాయ వివరాలు వెల్లడించకుండానే మార్కెటింగ్ శాఖ కడప సంయుక్త సంచాలకుడు రామాంజనేయులు, అన్నమయ్య జిల్లా సహాయ సంచాల కుడు త్యాగరాజు వెనుదిరిగారు. వేలం పాటల్లో భాగంగా తమకు ఎదురైన అవమానకర పరిస్థితుల దృష్ట్యా వారు నిస్సహాయంగా వెనుదిరిగినట్లు సమాచారం. పెరిగిన ఆదాయాన్ని ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత బహిర్గతం చేస్తామని స్థానిక అధికారులు తెలిపారు. గతంలో గదుల అద్దెల ద్వారా మార్కెట్ కమిటీకి ప్రతి నెలా రూ.3 లక్షల ఆదాయం వచ్చేది.

బోధనకు యాప్‌ల గండం

- యాప్‌లలో వివరాల నమోదుకు సమయం వృథా
- బోధనకు సమయం సరిపోలేదంటున్న ఉపాధ్యాయులు
- యాప్‌ల భారం తగ్గించాలని కోరుతున్న ఉపాధ్యాయ సంఘాలు



మరుగుదొడ్ల ఫొటో తీస్తున్న హెచ్‌ఎం సుబ్బరాజు

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 24: పాఠశాలలో సమస్త సమాచారం తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల యాప్‌లు విద్యాబోధనకు ఆటంకంగా మారుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్తకొత్త యాప్‌లను ప్రవేశపెడుతూ నిర్దేశించిన గడువులోపు వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటంతో బోధనకు ఉపాధ్యాయులు సమయం కేటాయించలేకపోతున్నారు.

యాప్‌లలో నమోదు ఏవంటే..

- పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు మొదట ముఖ ఆధారిత హాజరు వేసుకోవాలి. సర్వర్, నెట్‌వర్క్ సమస్యల వల్ల 10 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది.
- ఉపాధ్యాయుల హాజరు పూర్తికాగానే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి మరికొంత సమయం పడుతోంది.
- ఆ తర్వాత ఐఎంఎంఎస్ యాప్‌లో పాఠశాలలోని మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం అంతా పూర్తికావడానికి 30 నుంచి 40 నిమిషాలు సమయం పడుతోంది.
- మధ్యాహ్న సమయంలో మధ్యాహ్న భోజన వివరాలను నమోదు చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.
- పాఠశాలకు వచ్చిన బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగిజావ వివరాలను ఉపాధ్యాయులే నమోదు చేయాలి.
- నాలుగు ఎఫ్‌ఏ-1 పరీక్షలు, రెండు ఎస్‌ఏ1- పరీక్షలకు సంబంధించిన వివరాలను యాప్‌లలో నమోదు చేయడంతో పాటు థరల్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సాధించిన ప్రగతిని అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.
- అలాగే ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వివరాలను, విద్యార్థులు బైజూస్ కంటెంట్‌ను ఉపయోగించిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.
- ఇవికాక దీక్ష, నిష్ఠ, షిఫ్ట్ చార్ట్ ద్వారా ఉపాధ్యాయుల వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి.
- మండల, జిల్లా విద్యాశాఖాధికారులు అడిగిన వివరాలను ఆన్‌లైన్, యాప్‌లలో నమోదు చేయాలి.

ఇవి కాక ప్రతి ఏడాది ఉపాధ్యాయులు సొంత చేతి రాతతో లెసెన్‌ప్లాన్, డైరీలను రాయాలని అధికారులు సూచిస్తుండటంతో ఒత్తిడికి గురవుతున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో..

జిల్లాలో సుమారు 550 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఆ పాఠశాలల ఉపాధ్యాయుడే విద్యాబోధనతో పాటు యాప్‌లలో వివరాలను నమోదు చేయాలి. ఈ పాఠశాలలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఎక్కువగా ఉండటంతో వివరాల నమోదుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక టీచరే బోధన చేయాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్తకొత్త బోధన విధానాలపై ఉపాధ్యాయులు శిక్షణకు హాజరవుతుండటంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. నాడు-నేడు పనుల పేరుతో అనుభవం లేని ఇంజనీరింగ్ పనులు చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులు విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నారని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్ది పనిభారం తగ్గాల్సింది పోయి పని భారం పెరుగుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాబోధన చేయడం కన్నా యాప్‌లలో నమోదు చేయడం భయంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా పూర్తి సమయంలో బోధనకే పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి

- శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఉపాధ్యాయులకు బోధనేతర పనులను మినహాయించి బోధనకే పరిమితం చేయాలి. అనవసరమైన యాప్‌లను తొలగించి ప్రశాంత వాతావరణంలో బోధన జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి

- సుబ్బరాజు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై యాప్‌ల వల్ల పని ఒత్తిడి పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు

- కలెక్టర్ విజయరామరాజు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేశ్ కుమార్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు సిద్ధం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను లక్ష్యం మేరకు సమర్థవంతగా అమలు చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు, రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్, హౌసింగ్, గృహ నిర్మాణం, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు, ప్రాధాన్యత భవనాలు, ఆరోగ్యం, వైద్యం, జగనన్న ఆరోగ్యసురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ బోర్డుమీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సీఎస్‌కు వివరించారు.

పుష్పగిరి వద్ద పెన్నానది నీటిగుంతలో పడి వ్యక్తి మృతి



చెన్నయ్య మృతదేహం

వల్లూరు, ఫిబ్రవరి 24: పుష్పగిరి వద్ద పెన్నానది నీటిగుంతలో పడి చింతకొమ్మదిన్నె మండలం పోలుగారిపల్లెకు చెందిన చెన్నయ్య (43)అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు... బే ల్దారి పని చేసి జీవించే చెన్నయ్య తోటి పనివారితో కలిసి మొత్తం తొమ్మిది మంది శుక్రవారం పుష్పగిరి సమీపంలో పెన్నానదిలో డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారు. భోజనానంతరం చెన్నయ్య కనిపించకుండా పోయాడు. ఆయన సమీపంలోని నీటి గుంత వైపు వెళ్లాడని, అందులో మునిగి ఉంటాడని వారిలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమాచారాన్ని తోటి కూలీలు అతని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చెన్నయ్య భార్య గంగమ్మ తన భర్త కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి పుష్పగిరి వద్దకు వెళ్లి తోటి కూలీలను విచారించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం పుష్పగిరి చెన్నకేశవస్వామి ఆలయానికి దిగువన కొంత దూరంలో పెన్నానదిలో ఉన్ననీటి గుంతలో చెన్నయ్య మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం -వ్యక్తి అరెస్టు



వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఫారెస్టు సిబ్బంది

బద్వేలు, ఫిబ్రవరి 24: బద్వేలు అటవీశాఖ పరిధిలోని లోతువంక బీటులోని సొరగొంది పాయ ప్రాంతంలో వాహనంతో పాటు 5 ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ వెంకట శేషయ్య శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు అటవీ పరిధిలో దాడులు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ తమిళ సెల్వన్ శరవణనన్, మారుతీ సుజుకి స్విఫ్ట్, డిజైర్ కారులో 5 ఎర్రచందనం దుంగలను ఉంచి రవాణాకు సిద్ధంగా ఉన్న సమయంలలో అతనిపై దాడులు నిర్వహించి వాహనంతో పాటు దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు సుంకరయ్య, సువర్ణ కుమార్, రాజేష్‌రెడ్డి, ఏబీవో షాజాహాన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

వేంపల్లె, ఫిబ్రవరి 24: వేంపల్లెకు చెందిన మేదర మహిమజ్యోతి అనే విద్యార్థిని (17) ఆత్మహత్య చేసుకుందని హెడ్‌కానిస్టేబుల్ వర్మ తెలిపారు. రెడ్డయ్య కాలనీ సమీపంలో చెట్టుకు శుక్రవారం సాయంత్రం చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుందని తెలిపారు. ఉరి వేసుకున్న విద్యార్థినిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని తెలిపారు. స్థానిక ప్రైవేట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మార్కులు తక్కువగా వస్తున్నాయని ఆందోళన చెందేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంది. కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని విద్యార్థిని తండ్రి గంగన్న ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నేడు జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ ఎంపికలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 24: కడప నగరం శివానీ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు 70వ సీనియర్ జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ టీం ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ టి.జనార్దన్ తెలిపారు. ఔత్సాహిక కబడ్డీ క్రీడాకారులు 85 కేజీల లోపు బరువు కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన జట్టు వచ్చే మార్చి 8 నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరగనున్న 70వ అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్ పులివెందులకు రాక

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ సోమవారం పులివెందులకు రానున్నారు. సోమవారం ఉదయం 5-30 గంటలకు పులివెందులకు చేరుకుంటారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట లోగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4-30 గంటలకు పులివెందుల నుంచి రోడ్డు మార్గాన మచిలీపట్నం బయలుదేరి వెళతారని కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 24: పోలీసులు దుర్భాషలాడంతో పాటు కొట్టారన్న మనస్తాపంతో ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లికిచెందిన వెంకట రమణ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వెంకట రమణ కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో వెంకట రమణను ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంకటరమణ తన భార్యతో కలిసి మండల పరిధిలోని కొత్తపల్లె కూడలి వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ అక్కడే నివాసం వుంటున్నాడు. ఈ నెల 22 రాత్రి గస్తీకి వెళ్ళిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు హోటల్ మూసివేయాలని వెంకట రమణ భార్యను దుర్భాషలాడినట్లు ఆరోపించారు. మరుసటి రోజు శుక్రవారం దంపతులను పోలీసు స్టే షనుకు పిలించి స్టేషన్లో వెంకటరమణను కొట్టారని ఆరోపించారు, దుకాణ యజమానిని పిలిపించి తమను ఖాళీ చేయించేలా పోలీసులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో వెంకటరమణ మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ సీఐ రమణారెడ్డిని వివరణ కోరగా వెంకటరమణ రాత్రి పూట హోటల్ నడుపుతుండటంపై మూసివేయమని హెచ్చరించామని అందువల్ల తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. అతన్ని పోలీసులు కొట్టలేదని తెలిపారు.

పోలీసులు కొట్టారని ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలింపు



ఆసుత్రికి తరలిస్తున్న దృశ్యం

వీరబల్లి, ఫిబ్రవరి 24: పోలీసులు కొట్టారని మనస్తాపానికి గురైన ఓ ఆటో డ్రైవర్ పోలీసు స్టేషన్ ఆవరణలోనే విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికుల, బంధువుల కథనం మేరకు వివరాలిలా.. కమ్మపల్లికి చెందిన ఆటో డ్రైవర్ శేషయ్యనాయుడు, రమేశ్‌నాయుడు అన్నదమ్ములు. వీరి కుటుంబ సభ్యులు శనివారం ఘర్షణ పడ్డారు. దాంతో రమేశ్ నాయుడు తన తమ్ముడు శేషయ్య నాయుడుపై పోలీసులకు ఫిర్యాదు చేశా రు. విచారణ పేరుతో అతనిని పోలీసులు చితకబాదడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తన తప్పు లేకున్నా పోలీసులు తీవ్రంగా కొట్టడంతో, ఓ దుకాణంలో సూపర్‌వాస్మోల్ కొనుగోలు చేసి పోలీసుస్టేషన్ గేటు వద్దనే తాగి కింద పడిపోయాడు. అది గుర్తించిన పోలీసులు 108 వాహనంలో రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

50 మద్యం సీసాల స్వాధీనం

వీరబల్లి, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని ఓదివీడు పంచాయతీ కావలిపల్లి వద్ద 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. రాయచోటి నుంచి మద్యం బాటిళ్లను తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం



వల్లూరు, ఫిబ్రవరి 24: మండలంలోని పైడికాల్వలో వెలసిన రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ, కుంబాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కన్నులపండువగా సాగిన ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చూసిన భక్తులు తరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కాగా ఉదయం రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 24: పులివెందుల పట్టణంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అంగరంగవైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. శనివారం శ్రీవారి బ్రహ్మరథోత్సవం గోవిందనామస్మరణ మధ్య వేడుకగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు, అర్చకులు భరద్వాజ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణల మధ్య ఉన్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకొని టెంకాయలు కొట్టారు. ఉదయం 11గంటల సమయంలో ఆలయం నుంచి భక్తుల కోలాహలం నడుమ రథాన్ని లాగుతూ ముందుకు కదిలించారు. పట్టణంలోని పాతబస్టాండ్, పూలంగళ్ల సర్కిల్, బంగారు అంగళ్ల వీధి తదితర ప్రాంతాలలో రథం ఊరేగింది. పట్టణం గోవిందనామస్మరణతో మారుమోగింది. పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రగతి : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 24: నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం, అన్యాయం చేసిందని కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి సంజీవినీలాంటి ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందని, కడపజిల్లాలో స్టీల్‌ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిందని, విభజన చట్టంలోని అంశాలను చాలామటుకు అమలు చేయలేదని నిప్పులు చెరిగారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత గర్హనీయమన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రభవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. ప్రత్యేక హోదా రావాలన్న, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు రావాలన్న, విభజన చట్టంలోని అంశాలు అమలుకావాలన్న అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. 26వ తేదీ సోమవారం అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే అనంతపురంలో ఎన్నికల శంఖారావం పూరిస్తారని, దీనిని జయప్రదం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జియాలజీ పరిశోధకుడు బాలాజీకి రూ.27 లక్షల ఫెలోషిప్

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 24: వైవీయూ ఎర్త్ సైన్సెస్ విభాగం పూర్వవిద్యార్థి డాక్టర్ ఇటుకెల బాలాజీ భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్‌బోర్డు నేషనల్ పోస్టు డాక్టరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈయన పరిశోధనకు గాను డీఎస్‌టీ సెర్బ్ రూ.27లక్షలు మంజూరు చేశారు. వైవీయూ జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వెంగల సునీత మార్గదర్శకంలో బాలాజీ పట్టణ వాటర్ షెడ్ నిర్వహణ అనే అంశంపై రెండేళ్ల పాటు పరిశోధన చేయనున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి పీడీఎఫ్ పొందిన బాలాజీని అభినందించారు.

కడప రైల్వేస్టేషన్ అభివృద్ధికి రేపు వీడియోలింకు ద్వారా ప్రధాని శంకుస్థాపన

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: గుంతకల్లు డివిజన్‌లో 15 రైల్వేస్టేషన్ల పునరభివృద్ధికి వీడియోలింకు ద్వారా ప్రధాని మోదీ 26వ తేదీ సోమవారం శంకుస్థాపన చేస్తారని కడప రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 24 ఆర్‌వోబీలకు శంకుస్థాపన చేస్తారన్నారు. రాష్ట్రంలో మొత్తం 72 స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా గుర్తించారని వీటిని దాదాపు రూ.3141 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. చిన్న స్టాపేజీని కూడా గుర్తుండిపోయేలా మార్చడం, సౌకర్యాలు కల్పించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, మేయర్, జడ్పీచైర్మన్‌తో పాటు పలువురు పాల్గొంటున్నట్లు తెలిపారు.

మూకుమ్మడి రాజీనామాలు!

● టీడీపీ టికెట్ రమేష్ రెడ్డికి కేటాయించలేదని ఆగ్రహం


రాజీనామా పత్రాలను చూపుతున్న మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు


రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24: నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి కేటాయిస్తూ టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం రమేశ్‌కుమార్‌రెడ్డి వర్గం మూకుమ్మడిగా రాజీనామా చేసింది. స్థానిక బోస్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కాలాడి ప్రభాకర్‌రెడ్డి, మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, రాయచోటి పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, చిన్నరెడ్డెయ్య యాదవ్, బెల్లం నరసింహారెడ్డి, రవీంద్రబాబు, జయరాంలతో పాటు ఐటీడీపీ కన్వీనర్లు, తెలుగు యువత కార్యదర్శులు, 10 మంది క్లస్టర్ ఇన్‌చార్జిలు, 40 మంది యూనిట్ ఇన్‌చార్జులు, 200 మందికిపైగా బూత్ ఇన్‌చార్జులు, మాజీ ప్రజా ప్రతినిధులు తమ పదవులతో పాటు, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం పార్టీ కోసం కష పడడమే కాకుండా పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ, అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీని బలోపేతం చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ఎన్నో ఏళ్లుగా పార్టీని భుజ స్కంధాలపై మోస్తున్న వారిని కాదని, వలస పక్షులకు టికెట్ కేటాయించడం బాధాకరంగా ఉందన్నారు. అందుకే పార్టీ పదవులతో పాటు, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. తమ రాజీనామా పత్రాలను అధిష్టానానికి పంపనున్నట్లు వారు తెలియజేశారు.

ఓబులేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ


ఓబులేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, భక్తులు

సుండుపల్లె, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని తిమ్మసముద్రం సమీపంలోని ఓబులేశ్వర స్వామికి టీడీపీ రాజంపేట పార్లమెంటరీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి పాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు శివకుమార్‌నాయుడు, యర్రంరెడ్డి, నాగసుబ్బయ్య, మధుసూదన్ నాయుడు, ఓబయ్యనాయుడు, జనసేన నాయకులు రామా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుస్వామి తిరుణాల


కందుకూరి గురుస్వామి మూలవిరాట్

సంబేపల్లె, ఫిబ్రవరి 24: కందుకూరి గురుస్వామి తిరుణాల సందర్భంగా శనివారం గడికోట గ్రామం యడపల్లి సమీపంలోని ఆలయంలో గురుస్వామి సేవకుడు కందుకూరి నాగేశ్వర భక్తులతో కలిసి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రజలు చుట్టుపక్క ప్రాంతాల వారు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం భోజన సౌకర్యం కల్పించారు. . రాత్రికి ఒంటిమిట్ట నాగిరెడ్డి ఆధ్వర్యంలో చెంచు నాటకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్త్రీలు సంతానం కోసం వరపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ దీపాలంకరణలతో డప్పు వాయిద్యాలతో చాందినీ బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశంతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలను అందించనున్నట్లు తెలిపారు.

పౌర్ణమి సందర్భంగా చీరెల పంపిణీ


చీరెలు పంపిణీ చేస్తున్న పరిటాల జగన్నాథం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి, భుజంగేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పరిటాల జగన్నాథం కుటుంబ సభ్యులు 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రమాదంలో గాయపడిన పరిటాల జగన్నాథం త్వరగా కోలుకోవాలని కన్యకా పరమేశ్వరికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, పరిటాల బాలాజీ శ్రీరాములు, కృష్ణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లివర్ వ్యాధి బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ మంజూరు

రాజంపేట, ఫిబ్రవరి24 : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కోడూరు మంజునాథ్‌కు లివర్ వ్యాధి చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 17లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఏపీఐఐసీ డైరెక్టర్ తంబెల వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి సీఎంతో చర్చించి లివర్ మార్చేందుకు ఈ మొత్తాన్ని మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బహిరంగ ప్రకటన

మా కక్షిదారుడైన కీ.శే. నువ్వూరి వెంకటసుబ్బారెడ్డి గారి కుమారుడు నువ్వూరి రోశిరెడ్డి, డి.నెం. 6/9, జి.రామారావు వీధి, కడప సిటి వారు ఇచ్చిన సూచనల మేరకు ఇచ్చిన నోటీసు ఏమనగా, మా కక్షిదారుడైన నువ్వూరి రోశిరెడ్డి 20,51,695/-(అక్షరాల ఇరవై లక్షల యాభై ఒక్క వేల ఆరు వందల తొంభై అయిదు రూపాయలు మాత్రమే) బాకీ రాబట్టుటకై డిక్రీ దాఖలా ఆస్తులను జప్తు చేసి వేలం వేయవలెనని మహారాజ రాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి రాజంపేట కోర్టు నందు E.P.No.2/2024, O.S.No.100/2014 E.P. దాఖలు చేసియున్నాడు. కావున ఎవ్వరైనా ఈ నోటీసు షెడ్యూలు దాఖలా ఆస్తులపై కీ.శే. బద్దిపూటి తిరుపాల్ రెడ్డి గారి భార్య బద్దిపూటి రామమ్మ గారితో గానీ వారి సంతానం గానీ ఎటువంటి క్రయ విక్రయాలు జరిపించిన యెడల సదరు క్రయ విక్రయాలు రద్దు అగునని మరియు అట్లు జరిపిన వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుమాని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : కడప జిల్లా (అన్నమయ్య జిల్లా) చిట్వేల్ సబ్ రిజిస్ట్రేషన్, పెనగలూరు గ్రామ పొలంలోని 1) సర్వేనెం. 61 సర్కారు పుంజ య. 0.99 సెంట్లు, 2) సర్వేనెం. 59/1 సర్కారు పుంజ య. 0.67 సెంట్లు, 3) సర్వేనెం. 487/1 సర్కారు పుంజ య. 1.47 సెంట్లు, 4) సర్వేనెం. 488 సర్కారు పుంజ య. 0.52 సెంట్లు, 5) సర్వేనెం. 490 సర్కారు పుంజ య. 1.84 సెంట్లు, 6) సర్వేనెం. 505/4 సర్కారుపుంజ య. 0.41 సెంట్లు, 7) సర్వేనెం. 62 సర్కారు పుంజ య. 0.10 సెంట్లు, 8) సర్వే నెం. 489 సర్కారు పుంజ య. 1.25 సెంట్లు, 9) సర్వేనెం. 489/3 సర్కారు పుంజ య. 0.67 సెంట్లు.

వి. రామమోహన్ & ఎన్.వి. నరసింహారెడ్డి, న్యాయవాదులు, కడప సిటీ

'అందరి మాట ఒకటే.. టీడీపీ విజయం తథ్యం'


పెనగలూరులో ప్రచారం చేస్తున్న రేవతి


టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న అనితా దీప్తి


ఒంటిమిట్ట: టీడీపీ నాయకుల ప్రచారం

పెనగలూరు, ఫిబ్రవరి 24: నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరి మాట టీడీపీ విజయం తథ్యమని రైల్వేకోడూరు యువ నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. శనివారం పెనగ లూరు మండలంలోని పొందలూరు, ఇటిమా పూరం, ముద్రపల్లి, నల్లపురెడ్డిపేట పంచాయతీ లో పరిధిలోని గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెప్పిన ఉచిత హామీలతో మోసపోయామని, నమ్మి ఓటు వేస్తే ధరలు పెంచి నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వైసీపీ పతనం తప్పదన్నారు. సుపరి పాలన కోసం టీడీపీని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాంప్రసాద్ నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి బాలకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి మురళి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్న, మాజీ తహసీల్దారు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ

రైల్వేకోడూరు(రూరల్): యువత భవిష్యత్తుకు బాబు గ్యారంటీ అని టీడీపీ నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. పట్టణంలోని వినాయక నగర్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. శాప్ మాజీ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, పట్టణ అధ్యక్షుడు పోకల మణి, వార్డు సభ్యులు మణి యాదవ్, మద్దిన గిరి నాయుడు, దారపనేని వెంకటరమణ నాయుడు, శ్రీను, ఏసోబు చౌదరి, మవిళ్ళ రామయ్య, నగిరిపాటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

ఒంటిమిట్ట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు జ్యోతి శివ అన్నారు. మండలంలోని పెన్నపేరూరు, ఇబ్రహీంపేట కాలనీలలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అవసాని శివశంకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పొత్తపి పెంచలయ్య, సిద్దవటం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బాణాల హరి, నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి: డీఎంహెచ్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24: మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్. కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో పల్స్‌పోలియో రూట్ సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి సారిగా జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 162 పల్స్ పోలియో కేంద్రాలు 46 మొబైల్ కేంద్రాలు, 45 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు, 160 రూట్లుగా విభజించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,94,000 వేల మంది ఐదేళ్లలోపు చిన్నారులు లక్ష్యంగా పెట్టుకు న్నట్లు తెలిపారు. హైరిస్క్ ప్రాంతాల్లో మొబైల్ సిబ్బంది పర్యటించి పోలియో చుక్కలువేయాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో దేవశిరోమణి, హెల్త్ ఎడ్యుకే టర్ బలరామరాజు, హెల్త్ సూపర్‌వైజర్‌వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహా, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి పల్స్ పోలియో కార్యక్రమానికి రూటు సూపర్‌వైజర్లుగా నియమింపబడిన సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో లాభార్థి సంపర్క అభియాన్


సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

రాజంపేట, ఫిబ్రవరి 24 : రాజంపేట పట్టణం బీజేపీ కార్యాలయంలో శనివారం లాభార్థి సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వై.సురేష్ రాజు అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా జి ల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై ప్రజలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ జగదీష్ స్వామి, కో-కన్వీనర్ అరిగె రాంప్రసాద్, మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.బి.నాగిరెడ్డి వెంకట్రామరాజు, జిల్లా కార్యదర్శులు సమ్మెట నరేందర్‌రాజు, తోట శ్రీనివాస్, ధీరజ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దయ్య స్వామికి పూజలు



చిన్నమండెం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని దేవగుడి పల్లిలోని మాలెపెద్దయ్య స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే పిల్లలు, పెద్దలు కలిసి చింతోలవాలికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

శివపార్వతుల కల్యాణ మహోత్సవం

సిద్దవటం, ఫిబ్రవరి 24 : శివరాత్రి మహోత్సవంలో భాగంగా మండలంలోని జ్యోతి గ్రామంలోని సిద్దవటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీశైల వేదపండితులతో శివపార్వతుల కళ్యాణోత్సవం చేశరు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం


వీరబల్లి: మాట్లాడుతున్న రామజగదీశ్


యాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

వీరబల్లి, ఫిబ్రవరి24: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. వీరబల్లి, గడికోట, వంగిమళ్ల గ్రామాల్లో శనివారం ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ చేసిన అభివృద్ధి కనుచూపు మేర కనిపించడం లేదన్నారు. ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న 17 పథకాలను తామే చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని తప్పక ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి నరేంద్రగౌడ్, సుండుపల్లె భాజాపా నాయకులు వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): రాష్ట్ర అభివృద్ధిపై ప్రజా పోరుకు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్ తెలిపారు. శనివారం మండలంలోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రజా పోరు యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఈ ప్రజ పోరు యాత్ర వెళ్తుందన్నారు. వైసీపీ నాయకుల్ల దుర్మార్గాలు దాడులకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్‌రాజు, ప్రజాపోరు కన్వీనర్ తోట శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ వర్మ, జోగినేని సుబ్బారావు, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ రావు, సూర్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, పాఠశాలల్లోని వంటశాలల తనిఖీ

పెనగలూరు, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్, ఆదర్శ బాలికల హాస్టల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల హాస్టల్, పెనగలూరు ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల వంట శాలలను నందలూరు కోర్టు న్యాయాధికారి లత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని, బియ్యం, వంట దినుసులను పరిశీలించారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్, పెనగలూరు ఉన్నత పాఠశాలలో మెనూ పాటించడం లేదని, వంటలు రుచికరంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడం, కూరగాయలు, వంట సరుకులు లేకపోవడం చూసి మండిపడ్డారు. వెంటనే వార్డెన్‌కు నోటీసులు ఇవ్వాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఉన్నత పాఠశాలలో వంటశాల శుభ్రంగా లేకపోవడంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఎంఈవో, హెడ్ మాస్టర్, వంట ఇన్‌చార్జిలు, వంట ఏజెన్సీ నిర్వాహకుడికి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ ద్వారా నోటీసులు పంపించాలని ఆదేశించారు. ఆ తరువాత ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయడం, పబ్జీగేమ్స్, ఇన్‌స్టాగ్రామ్ ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. సైబర్ క్రైమ్‌పై ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈవో సుబ్బరాయుడు, ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గుడి నిర్మాణం

చిన్నమండెం, ఫిబ్రవరి 24: దేవపట్ల రోడ్డు సమీపంలోని జగనన్న కాలనీ వద్ద శ్రీశ్రీ మణికంఠ అయ్యప్పస్వామి సొసైటీ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున అయ్యప్పస్వామి దేవాలయాన్ని నిర్మించినట్లు ఆ సంస్థ సభ్యులు తెలిపారు. . ఆలయ నిర్మాణం అనంతరం పురోహితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దాతలు హిందూ ధార్మిక సంఘాలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

మండిపల్లి ఎంపికపై టీడీపీ శ్రేణుల సంబరాలు


మీడియాతో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎంపిక కావడంతో మండిపల్లి భవన్ వద్ద శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి, బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. . అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ కేటాయించినందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ గెలుపు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేయాలని, మన బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం తెచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజక వర్గంలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి కుటుంబ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి బాక్స్ పుషింగ్‌కు కాంక్రీట్ అడ్డు


కాంక్రీటు బాక్స్‌కు అడ్డు తగిలిన కాంక్రీటు

నందలూరు, ఫిబ్రవరి 24: నందలూరు రైల్వే కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి కాంక్రీట్ బాక్స్ పుషింగ్‌కు ఎప్పుడో భూమి లోపల నిర్మించిన కాంక్రీటు పనులు అడ్డు తగిలాయి. శరవేగంగా జరుగుతున్న ఈ రైల్వే అండర్ బ్రిడ్జి పనులలో గతంలో ఏర్పాటు చేసిన రైల్వే పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి లోపల వేసిన బలమైన కాంక్రీట్ అడ్డుగా నిలిచింది. దీంతో పుషింగ్ పనులను ఆపి అడ్డుపడిన కాంక్రీటును తొలగించడం మొదలు పెట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తైతే తొగురుపేట, పాటూరు, నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలలోని ప్రజలు, రోగులు, విద్యార్థులకు సౌకర్యంగా మారనుంది. గతంలో నిర్మించిన అండర్ బ్రిడ్జి చిన్న వాహనాలు మాత్రమే వెళ్లేందుకు వీలుగా ఉంది. ఈ నిర్మాణం పూర్తైతే బస్సు, లారీలు, అంబులెన్సులు వెళ్లేందుకు అవకాశముండదు. దీంతో మండలంలోని ప్రజలు వీలైనంత త్వరగా ఈ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి కావాలని కోరుకుంటున్నారు.

జడ్పీ పాఠశాలలో ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

నందలూరు, ఫిబ్రవరి 24: పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్‌జేడీ ఏ.రాఘవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వంద శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని హెడ్ మాస్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవిలత, ఉపాధ్యాయులు సుదర్శన్‌రాజు, వీరారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, సుశ్మిత, అమర్‌నాథ్, షఫీ, పవనకుమారి, జగన్, ప్రసాద్, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజలకు సేవలు అందించండి


తహసీల్దారుతో మాట్లాడుతున్న కేకే చౌదరి

చిట్వేలి, ఫిబ్రవరి 24: పార్టీలకతీతంగా ప్రజలందరికీ సేవలందించాలని మండల టీడీపీ అధ్యక్షుడు నిజం గెలవాలి రూట్ మ్యాప్ కో-ఆర్డినేటర్ కె.కె.చౌదరి కోరారు. శనివారం టీడీపీ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దారు జ్ఞానేశ్వరితో మాట్లాడారు. మండలంలో ఓట్ల నమోదు విషయంలో దొర్లుతున్న తప్పులను సవరించాలని కోరారు. పార్టీలకతీతంగా అధికారులు సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, బాలాజీ, అనంత యాదవ్, బాలకృష్ణ యాదవ్, గుండాలయ్య యాదవ్, కరీం బాషా, షబ్బీర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, నవీన్ చౌదరి, వెంకటేష్ రాజు, పెంచల్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి24 : రాజంపేట మండలం హత్యరాల అరుంధతివాడలో బీజేపీ ఆధ్వ ర్యంలో ఆధ్యాత్మిక కవి సంత్ రవి దాస్ 647వ జయంతి వేడుకలను నిర్వహించారు. శనివారం స్థానికు లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ రవి రవిదాస్ సామాజిక న్యాయం కోసం 647 ఏళ్ల కిందటే పోరాడిన మహనీయుడన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయ, రామకృష్ణయ్య, వెంకటేసు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24; క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నెహ్రూ యువకేంద్రం సహకారంతో శ్రీవెంకటేశ్వర యూత్‌డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా అంజలి టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు సామాజిక సేవకుడు, విశ్రాంత యోగా ఉపాధ్యాయుడు రామకృష్ణయ్య అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జెర్సీ డైరీలో మిల్క్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


డైరీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చిట్వేలి, ఫిబ్రవరి24 : మండల పరిధిలోని గట్టుమీదపల్లె వద్ద గల జెర్సీ డైరీలో శనివారం రాజంపేట ఉపసంచాలకులు ఎర్రంశెట్టి విజయ్ భాస్కర్, ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ కె.డి.వరప్రసాద్, చిట్వేలి, పెనగలూరు పశువైద్యులు, మిల్క్ ఇన్‌స్పెక్టర్‌లు భువనేశ్వరి, వేదవతిలతో కలిసి డీడీ విజయభాస్కర్ దాడులు నిర్వహించారు. వెన్నశాతం పరిశీలించారు. డైరీ గర్బర్‌లో వెన్నశాతం నిర్ధారణకు వాడుతున్న ల్యాబ్ రసాయనాలను వాటి నాణ్యతను పరిశీలించారు. బల్క్ కూలర్ టాస్క్, పాలక్యాన్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాడి రైతులకు డైరీ అందిస్తున్న దాణా నాణ్యతను పరిశీలించారు. మార్చి 10వ తేదీలోగా ప్రతి అనలైజర్‌కు విధిగా లైసెన్సు తీసుకోవాలన్నారు. లేకపోతే మార్చి 10 తరువాత అనలైజర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డైరీలో అన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించినట్లు పశువైద్యులు భువనేశ్వరి, వేదవతి తెలిపారు. పాడి రైతులకు ఏవైనా సమస్యలు వస్తే స్థానిక పశువైద్యుల దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ఈ రైడ్స్‌లో డీఈవో నాయక్, గోపాలమిత్రలు, శివ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు 'మానవత' అండ


బాడీఫ్రీజర్‌ను అందిస్తున్న సదిపిరాళ్ల కృష్ణారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పేదవారికి అండగా ఉంటుందని ఆ సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. శనివారం రెస్కో మాజీ చైర్మన్ సదిపిరాళ్ల కృష్ణారెడ్డి మానవత సంస్థకు బాడీ ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలంలో ఇప్పటికి 3 బాడీ ఫ్రీజర్‌లు అందుబాటులో ఉన్నాయని, ధనిక పేద అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరికి ఉచితంగా వీటిని అందజేస్తున్నా మన్నారు. శాంతి రథం కూడా అందుబాటులో ఉందని ఎవరైనా ఉపయోగించుకోవచ్చున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదుయాదవ్, వివి రమణ, రవిశంకర్,రాము తదితరులు పాల్గొన్నారు

29న రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

గాలివీడు, ఫిబ్రవరి 24: మండలకేంద్రంలోని బుట్టిగారిపల్లెలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పురోహితులు నాగఫణి కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, కలశస్థాపన, పీఠపూజ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం కబ్జా

అడ్డుకున్న సిబ్బందిపై దౌర్జన్యం ● సర్వేయర్ మాటలూ బేఖాతర్

కార్వేటినగరం, ఫిబ్రవరి 24: కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఆక్రమించడానికి కొంతమంది స్థానికులు ప్రయత్నించారు. శనివారం నాలుగు కొయ్యలు నాటి ఆ స్థలం తమదంటూ బైఠాయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూసా ప్రతిపాదనతో కొత్త పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలలో విద్యార్థులకు నూతన భవనాలు, గతంలో శిథిలావస్థకు చేరుకున్న మూత్రవిసర్జనశాలలకు కొత్త నిర్మాణం చేపడుతున్నారు. కళాశాల పక్కనే కొంత మంది శనివారం కళాశాల స్థలంలో కొయ్యలు నాటి తమదంటూ బైఠాయించారు. సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఇది కళాశాల స్థలమని వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వీరిపై వారు దౌర్జన్యానికి పూనుకున్నారు. ప్రిన్సిపాల్


అక్రమంగా వేసిన గుడిసెలు


ఆక్రమిత స్థలంలో సర్వే చేస్తున్న సర్వేయర్

సమాచారంతో సర్వేయర్ వచ్చి స్థలాన్ని కొలతలు వేశారు. ఆ స్థలం కళాశాలదేనని తేల్చి చెప్పారు. కళాశాల స్థలంలో ఇలా కబ్జాలు చేయరాదని, అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని వారికి చెప్పారు. వారికి ఎలాంటి సమస్య ఉన్న రెవెన్యూ అధికారులకు విన్నవించాలని కోరారు. ఇలా సర్వేయర్ చెప్పినా వాళ్లు పట్టించుకోకుండా అక్కడే బైఠాయించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గతంలోనూ కళాశాల ఆవరణలో ఉన్న చెట్లను కొట్టేయడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇకపై ఇలాంటి పొరపాట్లు చేయమని విన్నవించుకోవడంతో కేసు ఉపసంహరించుకున్నట్లు గుర్తుచేశారు.

తాగి పడేస్తున్నారు..!

● పంట పొలాల్లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు
● ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్న రైతులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 24: పొలాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు కొని.. గ్రామ సమీపాల్లోని పొలాల్లో తాగి పడేస్తున్నారు. వీరి చర్యతో పంట పొలాల్లో పడుండే టెట్రా ప్యాకెట్ల వ్యర్థాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చౌడేపల్లె మండలం బత్తలాపురం గ్రామానికి చెందిన రైతు రెడ్డెమ్మకు గ్రామ సమీపంలో కొంత పొలం ఉంది. ఈ గ్రామ పరిసర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం లభిస్తుండటంతో మందుబాబులు సమీప పంట పొలాలను అడ్డాగా చేసుకుంటున్నారు. నిత్యం కర్ణాటక మద్యం తాగి ఖాళీబాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు పంట పొలాల్లో పడేసి వెళ్తున్నారు. దీనివల్ల పంటల సాగుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెడ్డెమ్మతోపాటు చుట్టుపక్కల పొలాల్లోనూ ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లే కనిపిస్తున్నాయి. కొందరు కూలీలను ఈ ప్లాస్టిక్ ప్యాకెట్లు ఏరిస్తున్నారు. అలాగే సాగుకు సిద్ధం చేస్తే ప్లాస్టిక్ మట్టిలో కలిసి భూసారం లోపిస్తుందని రైతులు అంటున్నారు. కర్ణాటక మద్యం విక్రేతలతోపాటు, పంట పొలాల్లో మద్యం తాగేవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పొలంలో పడున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఏరుతున్న కూలీలు


బత్తలాపురం చెందిన రెడ్డెమ్మ పొలంలో టెట్రాప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ పాకెట్లు



కోదండరామస్వామి ఆలయానికి కలశం తీసుకెళ్తున్న పురోహితులు, అశోక్‌రాజు - ప్రత్యేకాలంకరణలో కోదండరామస్వామి

వైభవంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం

విజయపురం, ఫిబ్రవరి 24: విజయపురంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. సిద్ధార్థ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ కొండూరు అశోక్‌రాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిల్పి మోహన్, శిష్య బృందంచే శ్రీరామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మీ హైగ్రీవ విగ్రహాలను సిద్ధం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ, పూర్ణాహుతి, హోమం, పూర్ణకుంభం, మహాసంప్రోక్షణ ప్రతిష్ఠ, అష్టబంధన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాల పురోహితులు, ఆలయ పురోహితుడు వందవాసి మహేశ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు: ఎస్పీ

చిత్తూరు, ఫిబ్రవరి 24: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రాకముందే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ జాషువా ఆదేశించారు. చిత్తూరులో శనివారం ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల సరిహద్దులో జిల్లా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో నిఘాతో పాటు నిత్యం వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా వృత్తి, విద్యాధికారి సయ్యద్ మౌల తెలిపారు. చిత్తూరులో శనివారం జరిగిన పరీక్షా కేంద్రాల చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలు కల్పించాలన్నారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, డీఈసీ సభ్యులు దయానందరాజు, డిస్ట్రిక్ బల్క్ ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో పున్నమి గరుడ సేవ



ఐరాల(కాణిపాకం),ఫిబ్రవరి 24: కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో శనివారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. గరుడుడిపై స్వామివారిని దర్శించుకునేందుకు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై జేసీ వీడియో కాన్ఫరెన్సు

చిత్తూరు (సెంట్రల్)/చిత్తూరు, ఫిబ్రవరి 24: రామకుప్పం, శాంతిపురం మండలాల్లో సోమవారం జరిగే సీఎం పర్యటన నిర్వహణపై జేసీ శ్రీనివాసులు శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బహిరంగ సభ వద్ద గ్యాలరీ ఇన్‌చార్జిలకు కేటాయించిన గ్యాలరీల్లో అన్ని ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. ఐడీ కార్డులు, గ్యాలరీలో అవసరమైన తాగునీటిని సిద్ధంగా ఉంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, డీఆర్వో పుల్లయ్య, డ్వామా, డీఆర్డీఏ పీడీలు రాజశేఖర్, తులసి, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు మురళీకృష్ణ, ప్రభాకర్, డీఈవో దేవరాజులు తదితరులు పాల్గొన్నారు. ఇక, సీఎం జగన్ పర్యటనపై పోలీసు అధికారులతో ఎస్పీ జాషువా సమావేశమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా చందూరాణి



వెదురుకుప్పం, ఫిబ్రవరి 24: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా ఎస్ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లెకు చెందిన చందూరాణి నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 నుంచి ఆమె కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

అవ్వ ఇంటికి రాలేదని తాత ఆత్మహత్యాయత్నం

సోమల, ఫిబ్రవరి 24: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాలేదనే మనస్తాపంతో భర్త గుళికల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ తంగేళ్లమిట్టకు చెందిన చిన్నప్ప(60) భార్య మునెమ్మ భర్త మీద కోపంతో అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో ఇంటికి రావాలంటూ భార్యను చిన్నప్ప కోరాడు. ఆమె అందుకు నిరాకరించింది. దీంతో ఆయన మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం గుళికల మందు తిన్నాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో సదుం వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

28న పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించాలని డీఈవో దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి రెండు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయి నుంచి మూడు ప్రదర్శనలు జిల్లా స్థాయికి పంపాలన్నారు.

అట్టహాసంగా తిరుపతి జన్మదినం

ఇకపై ఏటా టీటీడీ నిర్వహిస్తుందన్న భూమన





ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర 894వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గోవిందరాజస్వామి గుడి మాడవీధుల్లో వివిధ కళాబృందాల సందడి నడుమ ఉత్సవాన్ని ప్రారంభించిన టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. క్రీ.శ. 1130 ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజ స్వామి విగ్రహప్రతిష్ఠ జరిగిందని, ఆ రోజే రామానుజాచార్యులు తిరుపతి పుట్టుకకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇకపై ఏటా తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ మేరకు టీటీడీ క్యాలెండర్లో పొందుపరచడానికి పాలక మండలి తీర్మానిస్తుందని ప్రకటించారు.ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన వందలాది కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శనగా సాగిన కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామ సంకీర్తనా బృందాలు నగరవాసులకు కనువిందుచేశాయి.టీటీడీ జీయర్ స్వాములు,ఈవో ధర్మారెడ్డి,కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ మలిక గార్గ్, మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి (కల్చరల్)


త్రిశూల స్నానం - పంచమూర్తుల ఊరేగింపు

వేదోక్తంగా త్రిశూల స్నానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో ఏటి ఉత్సవం వైభవంగా జరిగింది.స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానాన్ని వేదోక్తంగా నిర్వహించారు. వారం రోజుల ముందు నుంచే ముక్కంటి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి ప్రదేశాన్ని ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్ల మూల మూర్తులకు ఆలయంలో అభిషేకాలు నిర్వహించాక అలంకార మండపంలో పంచమూర్తులైన స్వామి, అమ్మవారు, వినాయక స్వామి, సుబ్రమణ్య స్వామి, చండికేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తుల శివనామ స్మరణ మధ్య సద్యోముక్తి ప్రదేశానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు.జీవుడు శివసాయుజ్యం పొందేందుకు ఆచరించాల్సిన సద్యోముక్తి వ్రతకల్పాన్ని వేద పండితులు వివరించారు.ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలతో పాటు త్రిశూలానికి విశేష పూజలు చేశారు. నదీ జలంలో త్రిశూల స్నానం నిర్వహించేటప్పుడు భక్తులు పుణ్యస్నానాలాచరించారు.అనంతరం చతుర్మాడ వీధుల్లో పంచమూర్తుల ఊరేగింపు వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసి ఉన్న కుమారధార తీర్థ ముక్కోటికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాఘ మాసంలో పౌర్ణమి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులను శనివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీర్థానికి అనుమతించారు. భక్తిశ్రద్ధలతో గోవిందనామస్మరణ చేసుకుంటూ తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకుని హారతులు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్న ప్రసాదాలు, తాగునీరు ఏర్పాటు చేసింది. పటిష్ఠమైన భద్రత కల్పించారు.



తంబళ్లపల్లెలో టీడీపీ జెండాను ఎగురవేస్తా

●టీడీపీ-జనసేన శ్రేణులను కలుపుకొని వెళ్తా ● అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు ●నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి
●అంబరాన్నంటిన పార్టీ నేతలు, అభిమానుల సంబరాలు ● ములకలచెరువులో భారీ ర్యాలీ ● అభ్యర్థిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ- జనసేన శ్రేణులు


ములకలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి


తంబళ్లపల్లెలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు


జయచంద్రారెడ్డిని సన్మానిస్తున్న పీటీఎం మండల నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 24: టీడీపీ, జనసేన శ్రేణులందరిని కలుపుకొని వెళ్లి తంబళ్లపల్లె నియోజకవర్గ గడ్డపై రెండు పార్టీల జెండాలను రెపరెపలాడిస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి అవకాశం అల్పించారు. దీంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీ-జనసేన నాయకులు, కార్యర్తలు, మద్దతుదారులు, అభిమానులు ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన పార్టీల ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులందరిని సమన్వయ పరుచుకుని అందరిని కలుపుకుని అన్నమయ్య జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ-జనసేన జెండాలు రెపరెపలాడించి అధినేత చంద్రబాబునాయుడికి గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అధికారంలోకి రాగానే తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఇప్పటి వరకు లేని ఇండస్ట్రియల్ క్యారిడార్‌ను తప్పకుండా తీసుకొస్తానన్నారు. మీ అందరికి తెలిసిన వ్యక్తిని, మీ బిడ్డగా, మీ అన్నగా, తమ్ముడిగా భావించి, నన్ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో ప్రజలు, మద్దతుదారులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములకలచెరువులో అంబరాన్నంటిన సంబరాలు

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డికి అవకాశం దక్కడంతో ములకలచెరువులో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ములకలచెరువులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన అభిమానులు, మద్దతుదారులు, టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు దారి పొడవునా భారీ ఎత్తున బాణా సంచాపేల్చుతూ పూల వర్షం కురిపించారు. పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు, బస్టాండు సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ఓపెన్ టాప్ కారులో నుంచి ప్రజలకు అభివాదం చేశారు.

టీడీపీ కార్యాలయం వద్ద కోలాహలం

ములకలచెరువు వినాయకనగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో కోలాహలం నెలకొంది. టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలపేందుకు భారీ ఎత్తున ఆరు మండలాల నుంచి మద్దతుదారులు, అభిమానులు, పలువురు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు తరలిరావడంతో రోజంతా సందడి వాతావరణం నెలకొంది.

తంబళ్లపల్లెలో: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లెలో టీడీపీ జెండా రెపరెపలాడిస్తామని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు, తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డికి టికెట్ కేటాయించడంపై శనివారం తంబళ్లపల్లెలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక హరిత కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.పెద్దఎత్తున బాణసంచా పేల్చి చంద్రబాబు, లోకేశ్, జయచంద్రారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు సాంబశివ, మ్యూజికల్ శివ, సుబ్రమణ్యం, మధుసూధన్, బోయపల్లెశివ, మునాఫ్, రామాంజులు, మల్లేష్, సుబహాన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డిని కలసిన పీటీఎం మండల నాయకులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 24 : తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దాసిరిపల్లె జయచంద్రారెడ్డిని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించగానే శనివారం పీటీఎం మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. తంబళ్లపల్లెలో జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రంబాబు నాయుడికి కానుకగా అందిస్తామని టీడీపీ నాయకులు ఆయనకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఎదురొడ్డి పోరాడే దీటైన నాయకుడు జయచంద్రారెడ్డి అని వారు పేర్కొన్నారు. అందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వర్గవిభేదాలను పక్కన పెట్టి టీడీపీ విజయానికి కృషి చేసి పార్టీని గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షుడుసంపతికోట కిట్టన్న, లోకనాథ్‌రెడ్డి, టీడీపీ యువ నాయకుడు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, దేవప్పకోట సర్పంచ్ సురేష్, బి.కొత్తకోట నాయకులు గట్టు చంద్రన్న, ప్రభాకర్, శ్రీనివాసులు, చావిడి కిట్టన్న, కుందిలి శంకర్‌రెడ్డి,పద్మనాభ తదితరులు ఉన్నారు.

బి. కొత్తకోటలో: తంబళ్లపల్లి అసెంబ్లీ టీడీపీ టికెట్‌ను దాసిరిపల్లి జయ చంద్రారెడ్డికి కేటాయించడంతో బి.కొత్తకోటలో ఆయన అభిమానులు, పలువురు టీడీపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. శనివారం జ్యోతి బస్టాండులో టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీకి, పార్టీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి అనుకూల నినాదాలు చేశారు. కార్యక్రమంలో చావిడి కిట్టన్న, ప్రభాకర, పద్మనాభ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: తంబళ్లపల్లి టీడీపీ అభ్యర్థిగా దాసరిపల్లి జయ చంద్రరెడ్డిని టీడీపీ అధిష్ఠానం ప్రకటించడంతో టీడీపీ నాయకులు బాణసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. టీడీపీ గెలుపు కోసం టీడీపీ నాయకులు అందరు కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. కలిచెర్ల ఎం.ప్రభాకరరెడ్డి, శేషాద్రి, రామ కృష్ణారెడ్డి, ఖాదర్‌హుసేన్, రవినాయక్, సయ్యద్‌షావలి, ఖయ్యింబాషా, జి.జయరాం, మాబాషా, అక్బర్, ఖాజవలి, రిజ్వాన్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జడ్జి నూతన భవనం ప్రారంభం


నూతన భవనం ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి భీమరావు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24: తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో రూ.కోటి అంచనాతో నూతనంగా నిర్మించిన జడ్జి భవ నాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమరావు ప్రారం భించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడు తూ..పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి శిరీష్, డిస్ట్రిక్ లీగల్ సెల్ సెక్రటరీ కరుణకుమార్, మదనపల్లె అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అసిఫాసుల్తానా, స్థానిక న్యాయాధికారి ఉమర్‌ఫరూక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగమల్‌రెడ్డి, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

18 మంది పాత నేరస్థుల బైండోవర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24: మదనపల్లె తాలుకాపోలీసులు వివిధ కేసుల్లోనిందితులుగా ఉన్న 18మందిని స్థానిక తహసీల్దార్ రమాదేవి ఎదుట శనివారం బైండోవర్ చేశారు. ఈసందర్భంగా తాలుకా పోలీసుస్టేషన్ ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ ఎన్ శేఖర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత నేరస్థులను బైండోవర్ చేశామని తెలిపారు. వారంతా గొడవలకు, నేరాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ తెలిపారు.

బి. కొత్తకోటలో 18 మంది ..

బి.కొత్తకోట,ఫిబ్రవరి24: బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 18 మందిని శనివారం తహశీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నేరప్రవృత్తి కలిగి ఉండటంతో మరోసారి ఎటువంటి నేరాలకు పాల్పడ కూడదని బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24: వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని సబ్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక సబ్‌డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల అడవుల్లో ఆకతాయిలు చేసే అల్లరి పనులతో అగ్గి రాజుకుని అడవులు దగ్ధమవుతున్నాయన్నారు. ఇప్పటికే మదనపల్లె, పీలేరు, రాయచోటి, సానిపాయ అటవీ రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయడంతో పాటు అటవీసమీప ప్రాంతాల ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్‌వో మదనమోహన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పీలేరు, ఫిబ్రవరి 24: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని తన పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులను పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి తెలిపారు. మార్చి 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహాల్లో భాగంగా శనివారం ఆయన కోర్టులో వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాకే జ్యోతి, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీ అన్సారీ, పోలీసు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ శివయ్య అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో డీఈ, ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణ లబ్దిదారులకు బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించకుండా త్వరగతిన చేయాలన్నారు. హౌసింగ్ డీఈ శ్రీహరిరావు, ఏఈ సుజాత పాల్గొన్నారు.

బాధితులకు నల్లారి పరామర్శ

కలికిరి, ఫిబ్రవరి 24: మండలంలోని మర్రికుంటపల్లెలో శనివారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న 16 మంది బాధితులను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. కాగా శనివారం 16 మంది మహిళా కూలీలను ఆటోలో తీసుకెళ్తుండగా మర్రికుంటపల్లె వద్ద మలుపులో అదుపు తప్పి బోల్తా పడ్డింది. బాధితులంతా అదే పంచాయతీలోని పలు గ్రామాలకు చెందినవారు. స్థానికులు వెంటనే బాధితులందరినీ కలికిరిలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు.

నలవీరగంగాభవాని ఆలయ ప్రవేశం


ఆలయ ప్రవేశానికి ఊరేగింపుగా వస్తున్న అమ్మవారు.

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24: మండలంలోని సీటీఎం గ్రామంలో నలవీరగంగాభవానీ అమ్మవారు జాతర మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. మిట్టపల్లె అమ్మవారు పుట్టినిల్లు నుంచి అంగరంగవైభవంగా ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయకమిటీ సభ్యులు సర్పంచ్ సగినాల ఆనందపార్థసారధి, పారపట్ల సురేంద్రరెడ్డి, వెలుగు చంద్ర, పొగాకు వీరప్రతాప్‌లు ఆలయ ప్రవేశం చేయించారు. దీంతో సీటీఎం జాతర ప్రారంభమైంది. భక్తులు ఆలయానికి తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఈ జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు జాతరకు తరలిరానున్నారు. సటీఎం పరిసర గ్రామాల్లో జారత సందడి నెలకొంది.

మల్లాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పెద్దమండ్యం, ప్రిబవరి 24: పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కలకొండలో ప్రసిద్ధి చెందిన మల్లాలమ్మ గ్రామ దేవత ఆలయ నిర్మాణానికి శనివారం వేదపండితుడు ప్రసాద్‌స్వామి భూమి పూజ నిర్వహించారు. గర్భగుడి ఆలయ నిర్మాణ దాతలు సి.గొల్లపల్లి గ్రామ ఉప సర్పంచ్ గొర్ల అమరనాథ, ఉదయకుమార్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు సుమారు రూ. 5లక్షల వ్యయంతో స్వంత నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు దాతలు వెల్లడించారు. ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి, చంద్రశేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కలకడ, ఫిబ్రవరి 24:మండలంలోని గంగాపురం పంచాయతీ బాహుదా నది ఒడ్డునున్న కోటిలింగేశ్వర ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా గణపతి, చంద్ర, సూర్య, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో ఉదయం నుంచి బింబస్థాపన ప్రతిష్ఠామహోత్సవం, కళహోమం, జ్వాలకటక దర్శనం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానాలు చేశారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని .దర్మపథంలో శనివారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అభయాంజనేయస్వామికి వడమాల, తోమాల సేవలు ఆకుపూజ, విశేష అలంకరణలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: పట్టణంలో పలు ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా శనివారం విశేషపూజలు నిర్వహించారు. అందులో భాగంగా మంజునాథ ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు ఆలయకమిటీ దర్శనం కల్పించారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో, అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమికి ప్రూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా వారికి అన్నదానం చేశారు.

పీలేరులో: మాఘ పౌర్ణమి సందర్భంగా పీలేరు సదుం రోడ్డులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజు స్వామి నేతృత్వంలో వ్రతం ఆచరింపజేశారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 24:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గా దుమ్ము చిన్నా

బి.కొత్తకోట, ఫిబ్రవరి24: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా దుమ్ము వెంకటేశ్వర్లు(చిన్నా)మాదిగ నియమితులయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కమిటీని విస్తరించే ప్రక్రియలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ నూతన నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 9 మందిని తీసుకోగా, అన్నమయ్య జిల్లా బి కొత్తకోట కు చెందిన దుమ్ము చిన్నాకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ తనమీద నమ్మకంతో మరోసారి రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించారన్నారు. మాజీ జడ్పీటీసీ ఈశ్వర్ చిన్నా ను అభినందించారు.

పార్టీ పదవులకు టీడీపీ క్యాడర్ మూకుమ్మడి రాజీనామాలు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి

బి.కొత్తకోట,ఫిబ్రవరి24: టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ప్రకటించిన 94 మంది అభ్యర్థుల జాబితాలో తంబళ్లపల్లె టికెట్‌ను పార్టీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్‌కు కాకుండా కొత్త అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డికి ప్రకటించడంతో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టీడీపీ క్యాడర్, ఆయన అనుచరులు రాజీనామా చేశారు. బి.కొత్తకోటలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ క్యాడర్‌ను, 10యేళ్లుగా పార్టీని నడిపిన ఇన్‌చార్జిని కనీసం సంప్రదించకుండా, ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. శంకర్‌కు మద్దతుగా పీటీయం, బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లి, పెద్దమండ్యం, కురబలకోట మండలాల పార్టీ కన్వీనర్లు ఆనందరెడ్డి, నారా యణస్వామిరెడ్డి, పాలగిరి సిద్దా, జిట్టా రమణ, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రలతో పాటు, గ్రామ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, టౌన్ కమిటీ, తెలుగుయువత అధ్యక్షులు, పార్టీ అను బంధ విభాగాల ప్రతినిధులు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ క్యాడర్ చేసిన రాజీనామాలను పార్టీ అధిష్ఠానానికి మెయిల్ ద్వారా పంపుతున్నామన్నారు. రెండునెలల క్రితం పార్టీలో చేరిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం సరికాదని నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసరా మీటింగ్‌లో మండల స్థాయి అధికారులకు చుక్కెదురు


సభాప్రాంగణం కింద కూర్చున్న ఎంపీడీవో మైతిలి, అధికారులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 23: స్థానిక జడ్పీహైస్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీలో మండల స్థాయి అధికారులకు చుక్కెదురైంది. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎంపీడీవో మైతిలితో పాటు డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి వేదికపై చోటు కల్పించక పోవడంతో వారు వేదిక కింద ఆశీనులు కావాల్సి వచ్చింది. కాగా ఎలాంటి ప్రొటోకాల్ లేకనే మదనపల్లి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ నాలుగవ విడత రుణ మాఫీ కింద 591గ్రూపులకు గాను రూ5.12కోట్లును పంపిణీ చేశారు. కాగా ఆసరా ప్రభుత్వ కార్యక్రమం వైసీపీ సమావేశంగా ఏర్పాటు చేసినట్లు పలువురు వాపోయారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఉండాలి

కురబల ఫిబ్రవరి 24: ఎన్‌సీసీ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఏపీ, తెలంగాణా ఎన్‌సీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వీఎమ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటుగా దేశ రక్షణకు అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పాటుపడాలన్నారు. అనంతరం ఎన్‌సీసీకి సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా చెరువునీటిని తోడేస్తున్నారని ఫిర్యాదు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24: అధికార పార్టీ అండతో కొంతమంది చెరువుకు మోటారుతో అక్రమంగా నీటిని తోడేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలాఉన్నాయి. వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామపంచాయతీలోని పాతకోటపల్లెలోని దిగువరంగారెడ్డి చెరువులో కొంతమంది అధికార పార్టీ అండతో చెరువు నీటిని అక్రమంగా మోటారు సహాయంతో తోడేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు సిద్దారెడ్డి, బాబురెడ్డి, రాజేష్‌కుమార్‌రెడ్డి, యల్లమ్మ, ఆదినారాయణ తదితరులతో పాటు మరో పదిమంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చెరువులో అక్రమంగా నీటిని తోడేయకుండా అక్రమదారులపై చర్యలు తీసుకుని, గ్రామానికి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పీలేరు టీడీపీ అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

టికెట్ ఖరారు కావడంతో టీడీపీ నేతల సంబరాలు


కిశోర్‌కుమార్ రెడ్డికి స్వీటు తినపిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి సూర్యప్రకాష్


బాణసంచా కాలుస్తున్న టీడీపీ శ్రేణులు

కలికిరి, ఫిబ్రవరి 24: పీలేరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం విడుదల చేసిన జాబితాలో ఆ మేరకు ప్రకటించారు. దీంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ శుభాకాంక్షలు చెపుతూ కిశోర్‌కుమార్‌రెడ్డికి స్వీటు తినిపించారు. కలకడ మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కిశోర్‌కుమార్ రెడ్డి నగరిపల్లెలో శనివారం ఓటర్ల జాబితాలపై సమీక్ష నిర్వహిస్తుండగా అదే సమయంలో టీడీపీ టికెట్లకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడడంతో పలు మండలాలకు చెందిన టీడీపీ శ్రేణులు ఆయన ఇంటి ముందు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అంతా కలిసి కిశోర్‌కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి టీడీపీ గెలుపుకు కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల టీడీపీ అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, పీలేరు నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి రవిప్రకాష్, ఎంపీటీసీ చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ తిరుపతి నాయుడు, మాజీ సర్పంచులు త్యాగరాజ, షబ్బీర్, శేఖర్ నాయుడు, నాయకులు బరకం శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులునాయుడు, మల్‌రెడ్డి, పాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ -జనసేన కూటమి అధికారం చేపట్టడం ఖాయం


నిమ్మనపల్లె సర్కిల్ వద్ద సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జన సేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ ఈ రోజు చంద్ర బాబు, పవన్‌కళ్యాణ్‌లు కలసి 99 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారన్నారు. వారిలో పీలేరు నుంచి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేరు ప్రకటించడం హర్షనీయమని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమే అని మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌చౌదరి, విజయమ్మ, రాజన్న, మురళి, గండికోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సొరకాయలపేటవాసులు



కలికిరి, ఫిబ్రవరి 24: కేవీపల్లె మండలం సొరకాయలపేట పంచాయతీకి చెందిన 30 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. శనివారం రాత్రి నగరిపల్లెలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో వారంతా పసుపు కండువాలు కప్పుకున్నారు. గురువారం రాత్రి ఇదే పంచాయతీకి చెందిన కొందరు టీడీపీలో చేరగా శనివారం మరో 30 కుటుంబాలవారు చేరారు. మోటుపల్లె వాండ్లపల్లె మాజీ సర్పంచు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఈవీ రమణ, లోకేష్, సాయి, గంగాధర, నాగేంద్రబాబు, ముబారక్, మహేష్, గౌతం, రవి తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కిశోర్‌కుమార్ కోరారు.

వైసీపీ ఇసుక దందా అధికారులకు కనిపించదా..?

● టీడీపీ శ్రేణుల ఆగ్రహం


మదనపల్లెలో ఇసుక డంప్ వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24: వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దందా అధికారులకు కనిపించడంలేదా? అంటూ మదనపల్లె టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఆదేశాల మేరకు స్థానిక రింగురోడ్డు వద్ద డంప్ చేసిన ఇసుక వద్ద టీడీపీ నాయకులు ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా మండల ప్రధా న కార్యదర్శి కత్తి లక్ష్మన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక దోపిడీ నిజమేనని కేంద్ర పర్యా వరణశాఖ, అటవీ మంత్రిత్వ శాఖ నిర్ధారించిందన్నారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించి భారీగా ఇసుక తవ్వకాలను గుర్తించారన్నారు. రోజుకు 2వేల టన్నుల ఇసుక దోపిడీ చేస్తున్నారని, దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేయాలని సీఎం జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రబెల్లి వెంకట రమణారెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆంజినేయులు, ప్రభాకర్, దుర్గాప్రసాద్ బావా జాన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్‌కి ఓటమి భయం పట్టుకుంది


వాల్మీకిపురం పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24: ముఖ్యమంత్రి జగన్‌కి ఓటమి భయం పట్టుకుని సైకోలాగా ప్రవర్తిస్తున్నాడని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి విమర్శించారు. శనివారం వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధి, చాకలవీధి, గాంధీపేటలలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రజలకు వివరిస్తూ టీడీపీని గెలిపించి చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలని కోరారు. వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పీలేరు నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, వల్లిగట్ల వెంకటరమణ, చంద్రమౌళి, కోసూరి రమేష్ స్వర్ణలత, మురళి, న్యాయవాది రమణ, కువైట్ సయ్యద్‌బాషా, బొక్కసం ఆనంద్, చాను, రామాంజులురెడ్డి, సాదిక్, డిష్‌బ్రదర్స్‌సర్దార్, మౌలా, సైదు, బషీర్, రమణ, అబ్బాస్, సయ్యద్‌అమీర్, లోకేష్, మస్తాన్‌వలి, ఆదినారాయణ, రెడ్డిరామ్, తదితర టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశాల మేరకే పని చేస్తాం

● రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

కురబలకోట, ఫిబ్రవరి 24: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే పని చేస్తామని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్ళులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె టీడీపీ టిక్కెట్‌ను తొలి జాబితాలో అభ్యర్థి జయచంద్రారెడ్డిని ప్రకటించారన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పార్టీ గెలుపు ఎంతో ముఖ్యమని, దాని కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలన్నారు. కొన్ని చోట్ల టిక్కెట్‌లు ఆశించి భంగపడ్డ వ్యక్తులు అసంతృప్తిని వ్యక్తం చేయడం సమంజసం కాదన్నారు. పార్టీలో వారికి సముచిత స్థానంతో పాటుగా మంచి నామినేటెడ్ పదవులను ఇస్తారన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, వెంకటరమణారెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి, దామోధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తెట్టు ఉపసర్పంచ్ బి.భాస్కర్, మధుకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు చేస్తూ రైతు మృతి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24: వ్యవసాయ పనులు చేస్తూ మదనపల్లె మండలం మిట్టామర్రి గ్రామానికి చెందిన శివారెడ్డి(55)అనే రైతు శనివారం మృతి చెందాడు. వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లారు. భార్యతో పాటు అనపతీగలు కడుతుండగా వున్నట్టుండి శివారెడ్డి కిందపడిపోయాడు. గమనించిన ఆయన భార్య సావిత్రమ్మ, గ్రామస్థుల సహాయంతో అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతనికి ఇద్దరు కుమార్తెలు వున్నారు.